### మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహావిష్కరణ కార్యాచరణలో భాగస్వాములు కండి: కమిటీ అధ్యక్షులు గడ్డం శరత్ పిలుపు



3లో

# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

### చేతి గుర్తుతో అభివృద్ధి హామీ... రాంనగర్‌లో సదన్ కుమార్‌కు వెల్లువెత్తిన మద్దతు



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 42 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 08 ఫిబ్రవరి 2026


# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే...

● మరో మూడేళ్లు అధికారంలో ఉండేది మేమే ● అభివృద్ధి చేస్తున్నాం..ఇంకా చేసి చూపిస్తాం ● వికారాబాద్, పరిగి, తాండూర్‌లకు గోదావరి నీళ్లు పారిస్తాం ● కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరంగా మారింది ● బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొట్టండి ● వికారబాద్ జిల్లా పర్యటనలో సిఎం రేవంత్ పిలుపు



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచేది మళ్లీ కాంగ్రెస్ పార్టీయేనని సిఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మీరిచ్చిన అధికారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని అంటూ..వికారాబాద్, తండూర్, పరిగి ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తామని అన్నారు. ఇందుకు మంత్రి శ్రీధర్ బాబే సాక్ష్యం అంటూ హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయన కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి , వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా మిగతా2లో...



## క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కేంద్ర సహకారం

### టెక్నాలజీ అభివృద్ధిలో కీలకం కానుందన్న కేంద్రమంత్రి

**అమరావతి,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను కేంద్రం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సీఎం చంద్రబాబుతో కలిసి మిగతా2లో...

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

### బస్తర్ జిల్లాలో లొంగిపోయిన 51మంది మావోలు



**రాయపూర్,7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా బస్తర్ డివిజన్‌లో 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మిగతా2లో...

## మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

### కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ ప్రకటన

### ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు




**కౌలాలంపూర్,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్లు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ మిగతా2లో...

### అణు ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే..

## ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి



**న్యూఢిల్లీ, 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమ దేశంతో అణు ఒప్పం దాన్ని కుదుర్చుకో వాల్సిందిగా ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మిగతా2లో...

## విద్యతో పాటు సంస్కారం కూడా నేర్పండి

● పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలదే

● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**విశాఖపట్నం,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యాసంస్థల్లో పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలపై ఉందన్నారు. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడమే కాదని, సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తులుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం మాత్రమే కాదని, ప్రకృతిని కాపాడుకునే బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. పెందుర్తిలోని బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా2లో...

## పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు..?

- ప్రజలంతా ఆయనను నిలదీయాల్సిందే
- గతంలో తిట్టిన కాంగ్రెస్ పంచన చేరిన పోచారం
- అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస
- బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో కెటిఆర్ విమర్శలు



2లో

## ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

● కెసిఆర్‌పై చర్యలు తీసుకుంటే అడ్డుకున్నదెవరు ● రేవంత్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమ కు అవసరం అని చెప్పుకోవాలి మిగతా2లో...



## మున్సిపాలిటీలన్నీ మా ఖాతాలోకే...

అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు

విపక్షాలు అభివృద్ధికి అడ్డం పడుతున్నాయి

మంత్రి పొన్నంతో కలసి మీడియా సమావేశంలో తుమ్మల

**సిద్దిపేట,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):**పంచాయితీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని, మెజార్టీ సీట్లను కాంగరెస్ గెలుచుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అసాధ్యమని భావించిన ఎన్నో సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని స్పష్టం చేశారు. కేవలం అసూయతోనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వారిని ఎప్పుడో తిరస్కరించారని ఆయన ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వేదికగా జరిగిన మీడియా సమావేశంలోతుమ్మల నాగేశ్వర్ రావు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలను మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా మిగతా2లో...

## హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

● దట్టంగా అలముకున్న పొగతో ఉక్కిరిబిక్కిరి

● మంటలను ఆర్పిన ఐదు ఫైర్ ఇంజన్లు




**హైదరాబాద్,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుము కుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్ని మాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసారు. అయితే అత్యంత మిగతా2లో...

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే...

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ-ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణపేట , కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టానికి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం కోర్టు కేసులను పరిష్కరించి ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్డు , రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చరిత్రను తాను చెరిపేయాలని చూస్తున్నానని కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర, దొంగ నోట్ల వ్యవహారం , దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంత కాలం చెరిగిపోదని, ఆ 'పాపాల భైరవుడి' చరిత్ర ప్రజలకు గుర్తుండేలా చేసే బాధ్యత తనదని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్ళీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

# పోచారం కాంగ్రెస్‌లోకి ఎందుకెళ్లారు

**కామారెడ్డి,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):**కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో స్వర్ణయుగం నడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పేదల కోసం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కానీ అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ముందుగా కొయ్యగుట్టలో అమర వీరుల స్తూపం వద్ద కేటీఆర్ నివాళులర్పించారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ .. పోచారం శ్రీనివాస్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని నమ్మి గెలిపిస్తే ఏం చేశాడని ప్రశ్నించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయులు దోచుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి గతంలో అన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక ఆంబోతు, రెండు దున్నపోతు లంటూ విమర్శించలేదా అని ప్రశ్నించారు. అయినప్పటికీ వెళ్లి రేవంత్ రెడ్డి పక్కకు చేరాడని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని రేవంత్ రెడ్డి తిట్టిన తిట్లను ఫోన్‌లో పెట్టి ప్రజలకు వినిపించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బండ కట్టుకొని బాయిలో దుంకాలె అని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లారో పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఓటేసి గెలిపించిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని గల్లా పట్టి అడగాలని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ సిగ్గు తీసిండని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కేటీఆర్ అన్నారు. తామే బాన్సువాడను మున్సిపాలిటీ చేశామని గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బాన్సువాడ నియోజకవర్గంలో 10వేల కోట్లతో అభివృద్ధి జరిగిందని వివరించారు. భవనాలు, ఆస్పత్రి, కులసంఘాల భవనాలకు రూ.500 కోట్లు ఇచ్చామని తెలిపారు. 42వేల మందికి ఆసరా పెన్షన్లు, 70 వేల మందికి రైతుబంధు, 14వేల మందికి రైతుబీమా ఇచ్చామని పేర్కొన్నారు. 15 వేల మందికి కల్యాణ లక్ష్మి, 30 వేల మందికి కేసీఆర్ కిట్లు అందించామని చెప్పారు. ఆ నిధులు అన్నీ కేసీఆర్ ఇచ్చిండని.. పోచారం పీకిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోకి వెళ్లాక ఒక్క రూపాయి కూడా పోచారం తీసుకురాలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దని సూచించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి కేసీఆర్ ఏం అన్యాయం చేశాడని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు పోచారం ఎగిరెగిరి పడ్డాడని విమర్శించారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండా ఎగురాలని అనుకుంటున్నారని అన్నారు. పోచారం లాంటి దొంగలకు సద్దులు కట్టింది చాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు.. మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్.. స్టువర్టుపురం దొంగలని ఎద్దేవా చేశారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని.. వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తులం బంగారం లేదు.. స్కూటీలు లేవు.. ఆరు గ్యారెంటీలు లేవని విమర్శించారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్ చెప్పిన నాలుగు వేల పెన్షన్ ఎవరికైనా వస్తుందా అని ప్రశ్నించారు. ఫ్రీ బస్సు పేరుతో రేవంత్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదు అని అన్నారు. మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలని ఆరోపించారు. రేవంత్, ప్రధాని మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషే, ఆయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని కేటీఆర్ ప్రజలను కోరారు. రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని, రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు అని కేటీఆర్ అన్నారు.

# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

రద్దీగా ఉండే ఈ ఆప్రాంతంలో పక్కనే నీలోఫర్ ఆస్పత్రి కూడా ఉంది. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాంచారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఎవరినీ ల్యాబ్ లోపలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కాగా.. ఉదయం 10:00 గంటల ప్రాంతంలో మొదటి ఫ్లోర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ మంటల్లో ఫోన్ ట్యాపింగ్‌కు కేసుకు సంబంధించిన హార్డ్ డిస్కులూ కాలిపోయినట్లు సమాచారం.నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరిరజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటుకు నోటు కేసు సహా పలు కీలక కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఎవిడెన్స్‌లు ఇక్కడే ఉండటంతో ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అంటున్నారు.

# ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు. పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.

## ఈఎన్‌సిగా రమేశ్ బాబు నియామకం

**హైదరాబాద్,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్‌సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటోరియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజి నీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు. సాధారణంగా కీలకమైన స్థానం ఖాళీ అవుతుంటే ముందుగానే తాత్కాలికంగానైనా ఇన్‌చార్జిని నియమించడం పరిపాటి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజులైనా భర్తీ చేయకపోవడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. అయితే ఈఎన్సీ జనరల్ స్థానం భర్తీ కాకపోవడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ మధ్య పేచీనే కారణమనే చర్చ జోరుగా వినిపిస్తున్నది.

# క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కేంద్ర సహకారం

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో జితేంద్రసింగ్ మాట్లాడారు.ఈ పునాది రాయి.. దేశ క్వాంటమ్ మిషన్‌కు మూలం కానుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీ త్వరగా అందిపుచ్చుకుంటోంది. డీప్ సీ మిషన్‌కు త్వరగా అనుమతులు ఇచ్చాం. 2024 తర్వాత ప్రతి చోటా క్వాంటమ్ టెక్నాలజీ పదమే వినిపిస్తోంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా వైద్యరంగంలో పెను మార్పులు వస్తాయి. క్వాంటమ్ మిషన్ అన్ని రంగాల్లో కీలకం కానుంది. అందుకే నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు రూ.6వేల కోట్లు కేటాయించాం అని కేంద్రమంత్రి వివరించారు. ఆవిష్కరణ సమయంలో అన్నీ చిన్నగానే కనిపిస్తాయి. కొన్నాళ్ల తర్వాత తెలుస్తుంది ఆ ఆవిష్కరణల విలువ ఏమిటో అని అన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్.. కమ్యూనికేషన్‌లోనూ కీలక మార్పులు తేనుందని కేంద్రమంత్రి తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, నారాయణ, కందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వీరిపై రూ.1.61 కోట్ల రివార్డు ఉంది. వీరంతా బస్తర్ ఎస్పీ జితేందర్ యాదవ్ సమక్షంలో శనివారంనాడు లొంగిపోయారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పాండుమ్ 2026 ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అమిత్‌షా రాయపూర్ వచ్చిన రోజునే ఇంత పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జిజాపూర్ జిల్లాలో 20 మంది మహిళా క్యాడర్‌తో సహా 30 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 21 మంది సుక్మా జిల్లాలో లొంగిపోయారని ఎస్పీ సుందరరాజ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా క్యాడర్ ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి కా÷-డగ్గ÷క్స్ వైర్‌లు, జెలటిన్ స్టిక్‌లో స్వాధీనం చేసుకున్నామన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు 50 వేల తక్షణ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస చర్యలతో స్వచ్ఛందంగా వీరంతా లొంగిపోయినట్టు చెప్పారు. కాగా, తక్కిన మావోయిస్టు క్యాడర్ కూడా హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి భద్రత, గౌరవంగా జీవించేందుకు అవసరమైన పునరావసం కల్పిస్తామని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ కోరారు.

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్-మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందిరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియాలోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద 'భారత్ మాతా కీ జై', 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

# అణు ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే.. ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

ఒత్తిడి చేశారు. అలా చేయకపోతే పర్యవసనాలు ఏమిటో ఇరాన్‌కు తెలుసునని పరోక్షంగా సైనిక చర్యను ఉద్దేశించి ట్రంప్ వ్యాఖ్యానించారు.ఒప్పందం కోసం మస్కట్‌లో ఇరాన్, అమెరికా చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఓ భారీ నౌక ఇరాన్ వైపు కదులుతోందని శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. ప్రస్తుత చర్చలు సానుకూలంగానే ఉన్నట్లు ఆయన తెలిపారు. చర్చలపై ఇరాన్ దౌత్యవేత్త ఒకరు స్పందిస్తూ సానుకూలంగానే చర్చలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు.

# విద్యతో పాటు సంస్కారం కూడా నేర్పండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారతదేశమని అన్నారు వెంకయ్యనాయుడు. ఈ మధ్యకాలంలో కొంతమంది నాయకులు విచ్చలవిడిగా... విర్రవీగుతూ బూతులు తిడుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు పోలింగ్ బూత్‌లోనే తగిన సమాధానం చెప్పాలన్నారు. రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఒక ఫ్యాషన్‌లా మారిపోయిందని మండిపడ్డారు. ఎంత ఎక్కువ బూతులు మాట్లాడితే అంత పబ్లిసిటీ వస్తుందని కొందరు భావిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు కంచికల రమేశ్ బాబు, విశాఖపట్నం మేయర్ పీల శ్రీనివాస్‌లతో పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్కూల్ పిల్లలతో కొంతసేపు సరదాగా మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి.. ఆ తర్వాత స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.

# మున్సిపాలిటీలన్నీ మా ఖాతాలోకే...

(మొదటి పేజీ తరువాయి)

బీసీ కులగణన చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకునే నేడు కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కులగణన చేపట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ విషయంలో దశాబ్దాల నాటి కల సాకారం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 13,000 కోట్లు వెచ్చించి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణెళినని ఆయన వెల్లడించారు. గత పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వారే నేడు నీతులు మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతాంగం, పేదలు, నిరుద్యోగులు సంతోషంగా ఉంటే ఓర్వలేక ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ , పంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేశారు, కానీ ప్రజలు తమ ఓటుతో మమ్మల్ని ఆశీర్వదించి వారికి బుద్ధి చెప్పారు' అని తుమ్మల గుర్తు చేశారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే స్థాయిలో ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలు సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సహకరించకపోయినప్పటికీ, అవసరమైతే తల తాకట్టు పెట్టయినా సరే అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తేల్చి చెప్పారు.

## చేతి గుర్తుతో అభివృద్ధి హామీ... రాంనగర్‌లో

# సదన్ కుమార్‌కు వెల్లువెత్తిన మద్దతు







**పరకాల, ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణం మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో కౌన్సిలర్ ఎన్నికల హోరు తారస్థాయికి చేరుకుంది. ప్రతి వార్డులోనూ నువ్వా నేనా అన్నట్టుగా ప్రధాన పార్టీలు పోటీపడుతూ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ పోటీ కోణంలో 11వ వార్డు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గూడెల్లి సదన్ కుమార్ ప్రజల్లో విశేష స్పందనతో ముందుకు సాగుతున్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా రాంనగర్ కాలనీలో సదన్ కుమార్ విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీలో అడుగుపెట్టిన ప్రతి చోట కాంగ్రెస్ జెండాలు ఎగురుతూ, చేతి గుర్తుకు మద్దతుగా ప్రజలు నినాదాలు చేశారు. యువత, మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొని సదన్ కుమార్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా సదన్ కుమార్ మాట్లాడుతూ "ప్రజాసేవ చేయడమే నా జీవిత లక్ష్యం. రాజకీయాలు పదవుల కోసం కాదుడ ప్రజల కోసం. గెలిచిన వెంటనే 11వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాను. నా వార్డు ఓటర్లకు చేదోడు వాదోడుగా నిలుస్తూ, ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాను" అని స్పష్టం చేశారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు.సదన్ కుమార్ మాటల్లో స్పష్టత, ఆచరణలో నిజాయితీ కనిపిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల మధ్యే పెరిగిన నాయకుడిగా, వార్డు అవసరాలు తెలిసిన వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. గత పాలకుల నిర్లక్ష్యానికి విసిగిపోయిన ప్రజలు ఈసారి మార్పు కోరుకుంటూ కాంగ్రెస్ అభ్యర్థి వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదన్ కుమార్‌కు అండగా నిలిచారు. రాంనగర్ కాలనీ అంతటా కాంగ్రెస్ శ్రేణుల ఉత్సాహం కనిపించగా, 11వ వార్డులో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్న నమ్మకం పార్టీ శ్రేణుల్లో బలంగా వ్యక్తమవుతోంది.

## మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహావిష్కరణ కార్యాచరణలో భాగస్వాములు కండి: కమిటీ అధ్యక్షులు గడ్డం శరత్ పిలుపు





**వరంగల్,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ జంక్షన్ చింతల్ బ్రిడ్జి నర్సంపేట రోడ్ వరంగల్ కూడలిలో మహాత్మా జ్యోతి భా పూలే విగ్రహ ప్రతిష్టాపన విగ్రహ నిర్మాణంలో లేబర్ కాలనీ, కీర్తి నగర్, చింతల్ బ్రిడ్జి ప్రజలు, రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తూ కరపత్రాలు ఆవిష్కరణ చేయడం జరిగిందని పూలే విగ్రహ కమిటీ ఉపాధ్యక్షులు పోగుల కన్నయ్య ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగిందన్నారు,, కార్యక్రమంలో పూలే విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు గడ్డం శరత్ మాట్లాడుతూ...మొట్ట మొదటగా తెలంగాణా జంక్షన్ లో మహాత్మా జ్యోతిభా పూలే విగ్రహాన్ని ప్రతిష్టించుటకు ప్రత్తిపాదించి విగ్రహాన్ని అందించిన ప్రొ, చింతం ప్రవీణ్ కుమార్ గారికి,ప్రజాప్రతినిధులకు, పెద్దలకు , విద్యావంతులు, సామాజిక కార్యకర్తలకు , అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక ఉద్యమభి వందనాలు తెలియజేస్తూ... మన దేశంలో అస్పృశ్యతను కుల అణిచివేతలను కుల పీడనలను తీవ్రంగా వ్యతిరేకించి సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని మొదటగా ప్రతిపాదించిన మహనీయుడు జ్యోతిభా పూలే! పురాణాలలోని నాయకులలో త్యాగశీలి బలి చక్రవర్తిని తన ఆదర్శమూర్తిగా భావించినవాడు. పురాణాల్లో .తన భార్యకు చదువు నేర్పించి ఆమె చేత బాలిక పాఠశాలలను పెట్టించిన వాడు ఆమెకు అండగా ఉండి ప్రోత్సాహపరిచినవాడు. మోసగించ బడిన ఒక బ్రాహ్మణ స్త్రీకి తమ ఇంట్లో రక్షణ ఇచ్చి పురుడు పోయించి ఆ బిడ్డను తమ కొడుకుగా యశ్వంత్ అని పేరు పెట్టి పెంచి పెద్ద చేసిన వారు. తనను చంపటానికి వచ్చిన అగ్రవర్ణాలు పంపిన బడుగు వర్గాల నిరుపేద గుండాలకు ఆకలి తీర్చి, తన బోధనలతో అంగులీ మాలుడిని బుద్ధుడు సన్మార్గుడిగా మార్చినట్లు మార్చి తన అనుచరులుగా చేసుకున్న మహనీయుడు. అంబేద్కర్ తన ప్రాణ సమాన ముగ్గురు గురువులలో ఒకడిగా ప్రకటించిన వాడు. వేలాది ప్రజల మధ్య బొంబాయి మహా నగరములో ప్రజల చేత "మహాత్మ" అని బిరుదు పొందిన భారత దేశ మొదటి మహాత్ముడు.మహనీయుడు గౌతమ బుద్ధుని తర్వాత ఆధునిక గౌతమ బుద్ధుడు అనదగిన వ్యక్తి. మహాత్మ జ్యోతిబాపూలే! అందుకని ఆ మహనీయుని విగ్రహ ఏర్పాటుకు సమస్త ప్రజలు చేయూతనందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పూలె విగ్రహ ప్రతిష్టాపన కమిటీ గౌరవ అధ్యక్షులు సోమా రామూర్తి,ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల భారత్,ధర్మపురి రామారావు,కంజర్ల జాకబ్ ,ఈసంపెల్లి ప్రభాకర్, యాదగిరి ప్రసాద్,రౌతు శ్రీనివాస్, కేడెల ప్రసాద్,బందెల సదన్న, గురుమిళ్ల రాజు,తెలంగాణ కొమురన్న,మిట్టపెల్లి శంకర్‌అన్న, మోహన్ అన్న, పోతరాజు ఆనంద్, తగరపు వేణు,ఆకేనపెల్లి కృష్ణ, పోలేపాక భాస్కర్, గడ్డం సరిత, సింగారపు పప్పి, ఐత సురేష్, ం. లాజర్, పసుల శ్రీనివాస్, అప్పని వెంకన్న, పాకాలపాటి జోసెఫ్, కొల్లూరి లేమిల్, పోగుల అశోక్‌లు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** రానున్న వేసవి కాలంలో జిల్లాలోని అన్ని గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్త కుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు.శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవో లు, ఎంపీవో లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గాయత్రి, ఈఈ రామాంజనేయులు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్‌లతో కలిసి వేసవిలో తాగునీటి సరఫరాకు సంబంధించి రూపొందించాల్సిన యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. గత సంవత్సరంలో తాగునీటి సమస్యలు ఎదురైన గ్రామాలు, వాటికి తీసుకున్న పునరుద్ధరణ చర్యలు, జిల్లాకు అవసరమైన నీటి సామర్థ్యం, నీటి వనరుల స్థితిగతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, తాగునీటి సరఫరాకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర నివేదికను మిషన్ భగీరథ ఈఈ లు, జిల్లా పంచాయతీ అధికారి త్వరితగతిన అంద జేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవో లు, ఎంపీవో లు ప్రతి ఇంటికి తాగునీరు అందుతున్నదా ? లేదా? అన్నది క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్లు, వలస కార్మికులు నివసిస్తున్న కాలనీలు సహా అన్ని నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని ఎంపీడీవోలు, ఎంపీవోలను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు.జిల్లాలోని గ్రామ పంచాయతీలలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డిఆర్డివో మేన శ్రీను, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ డిఈలు, ఏఈలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకై పకడ్బందీ ఏర్పాట్లు

**● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**





**హన్మకొండ,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** పగడ్బందీ ఏర్పాట్ల నడుమ మున్సిపల్ ఎన్నికలు విజయవంతం చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ 11 వ తేదీన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీ లకు జరిగే ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం కమిషనరేట్ కార్యాలయము లో అధికారులతో సమావేశనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముందుగా ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలపై సంబంధిత పోలీస్ అధికారుల వివరణ నిచ్చారు. ఈ సమావేశం లో ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, కౌంటింగ్ రోజున చేపట్టిన పోలీస్ బందోబస్తు వివరాలను కూడా పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను అక్రమ మద్యం మద్యం కట్టడి చేయడంతో పాటు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా అందించే తాయిలాలపై పోలీస్ అధికారులు నిఘా పెట్టాలని, ఎవరైనా, ఎక్కడైనా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించే వారి పట్ల కఠినంగా వుండాలని. బ్యాలెట్ పత్రాల పంపిణీ, ఎన్నికల రోజున, చివరగా కౌంటింగ్ రోజున పెద్ద సంఖ్యలో బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, సంబంధిత ఉన్నతాధికారులు ఎన్నికల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని. ఎన్నికల వేళ ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించే విధంగా పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజ మహేంద్రనాయక్, కవిత, ఏ.ఎస్పీలు శుభం, చేతన్, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా తో పాటు ఏసీపీలు, ఇన్స్ స్పెక్టర్లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

## ఆర్బిట్ ఇ- టెక్నో పాఠశాలలో 15వ వార్షికోత్సవ సంబరాలు











**హన్మకొండ,ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):**హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని ఎల్లాపూర్ శివారులో గల ఆర్బిట్ ఇ- టెక్నో పాఠశాలలో ఘనంగా 15వ వార్షికోత్సవ (అభ్యుదయ-2026) వేడుకలు పాఠశాల ఫౌండర్, చైర్ పర్సన్ చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి గెస్ట్ ఆఫ్ హానర్ రమా రావి హాజరై మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి అని, బాల బాలికలు అందరూ సమానమే అని, పిల్లలందరూ మరియు తల్లిదండ్రులు చక్కటి రాత కలగాలని, రామకోటి రాయాలని, అందరికీ ఓపిక ఉండాలని, ఎదుటివారికి సహాయం చేసే స్వభావం ఉండాలని అన్నారు. మోటివేషనల్ స్పీకర్ గూడల్లి శివప్రసాద్ మాట్లాడుతూ, సోషల్ మీడియా విద్యార్థుల పైన ప్రభావం ఎలా చూపెడుతుందో, విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులు ఎలా కష్టపడుతున్నారో, ప్రతి తల్లిదండ్రికి మరియు గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు ఉపన్యాసాలతో, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పిరమిడ్స్, పాటలు, డ్యాన్సులు, పరేడ్, స్కిట్ (నాటకాలు) లలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చిట్టి రెడ్డి హారిక రెడ్డి, అకాడమిక్ ఇన్చార్జి వాసుదేవరెడ్డి, మధుకర్, సారంగపాణి , జావిద్ ఖాన్, వెంకటేష్, రాజేష్, రాహుల్ రాజ్, అశోక్ రెడ్డి, మహేష్, చంద్రమోహన్, మురళీకృష్ణ, ప్రశాంత్, శ్రీనివాస్, సాయి కళ్యాణ్ ,కళ్యాణి, వహీదా బేగం, షర్మిల, స్వర్ణలత, రసజ్ఞ, రూపా దేవి, ,శ్వేతా రెడ్డి ,శ్వేత, ప్రవళిక, రజిత, రాధిక మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజనాల బండపై విశేష పూజలు

**అన్నమయ్య జిల్లా: పుంగనూరు ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చౌడేపల్లి: రాష్ట్రంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన మండలంలోని రాజనాల బండ పై శనివారం విశేష పూజలు జరిగాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే ప్రధానార్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ నరసింహ స్వామి క్షేత్రపాలకుడు ప్రసన్న ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదాలు వేసుకొని వెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు టీటీడీ సిబ్బంది దర్శన ఏర్పాట్లు కలిగించారు.



## ఎన్నికల ప్రచారంలో చిన్నారుల ఉత్సాహం



**ములుగు,ఫిబ్రవరి 7,(పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపాలిటీ ఎలక్షన్ లో భాగంగా ములుగు జిల్లా ములుగు మున్సిపాలిటీ అయిన బండారుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో చిన్నారులు ఉత్సాహంగా పార్టీ జెండాలు పట్టుకొని సైకిల్ కి ప్రతి ఒక్క పార్టీ జెండా కట్టుకొని తిరుగుతున్నారు సరదాగా పీసీడబ్ల్యూ న్యూస్ కెమెరాకి చిక్కారు చిన్నారులు

## ఎలక్షన్ ప్రచారానికి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్



**ములుగు,ఫిబ్రవరి 7,(పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా ములుగు మున్సిపాలిటీ ఎలక్షన్ ప్రచారంకి మల్కాజ్గిరి బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ గారు ఆదివారం ములుగు రానున్నారు

## చెరువుకట్టపై సర్వే నిర్వహించిన ఇరిగేషన్ డిపార్ట్మెంట్





**అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్ట ఆక్రమణకు గురవుతోందని రాష్ట్ర మాల మహానాడు అశోక్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ మరియు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు సర్వే నిర్వహించారు. చెరువుకట్ట దాదాపు 40 అడుగుల మేర ఆక్రమణకు గురైందని అశోక్ తెలిపారు. చెరువుకట్టు పై అనదికారికంగా నిర్మించిన కట్టడాలను గుర్తించి త్వరలో పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి ఆక్రమణలను తొలగిస్తామని ఇరిగేషన్ డిఇ మరియు ఏఈ తెలిపారు. చెరువుకట్టపై వ్యర్థాలు, మట్టిని వేయడంతో చెరువు ఆక్రమణకు గురవుతుందని పలువురు స్థానికులు వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి కట్టపై ఎలాంటి వ్యర్థాలను పార వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వీరభద్రస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి:శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రధానకార్యదర్శి కాసుల వినోద్





**హైదరాబాద్ ఫిబ్రవరి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** కురవి శ్రీ వీరభద్రస్వామి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 16వ తేదీన శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో కురవి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమ ఏర్పాట్లపై శనివారం కాచిగూడలోని సేవా సమితి కార్యాలయంలో ప్రతినిధులతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసుల వినోద్ మాట్లాడుతూ.. గత 8 సంవత్సరాలుగా ప్రతి ఏటా 4వేల మందికిపైగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే ఈసారి కూడా చేపట్టనున్న అన్న ప్రసాద వితరణ కార్యక్రమ ఏర్పాట్లపై పలువురు తమ సలహాలు, సూచనలు ఈ సందర్భంగా తెలియజేశారు. జ్ఞాన సాధనకు భక్తి, వైరాగ్యం, తపస్సు, పఠనం, జపం లాంటి అనేక మార్గాలు ఉన్నాయని, వాటిల్లో సులభంగా ఫలితాన్నిచ్చేది భక్తి మార్గమని ఆయన అన్నారు. భక్తి భావం ప్రతి ఒక్కరు పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రతినిధులు నాలుగు రోజుల పాటు మహబూబాబాద్ జిల్లా కురవి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం వద్ద తమ సేవలను అందించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ వీరభద్రస్వామి దేవాలయం మాజీ చైర్మన మేకల దామోదర్ రెడ్డి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ సభ్యులు కాసుల మల్లిఖార్జున్, సీనియర్ అడ్వొకేట్స్ కొండూరు వినోద్ కుమార్, కానుగు దేవేందర్, ఎం.నగేష్. ఎం. దీపిక, చిత్తరంజన్, మించు ఆనంద్వు, ఎం.విష్ణువర్ధన్ రావు, కె.రమణ, నర్రా సాయికిరణ శ్రీనివాస్, పాల్గొన్నారు.

## దోమల నివారణకై చర్యలు తీసుకోవాలని వినూత్న నిరసన తెలిపిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ



**ఉప్పల్ ఫిబ్రవరి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణి సత్యం సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినూత్న పద్ధతిలో నిరసన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రం శ్రీనివాస్ మాట్లాడు తూ జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ నందు దోమల బెడద ఎక్కువగా ఉన్నప్పటికీ అధికారులు మరియు పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజలు ఇంట్లో ఉన్న బయటకు వెళ్లాలన్న దోమల బెడతతో చాలా ఇక్కట్లు పడుతున్నారని, అధికారులకు పాలకులకు తెలియజేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని కోటల్లో జిహెచ్ఎంసి బడ్జెట్ కేటాయించినప్పటికీ కింది స్థాయికి వచ్చేసరికి ఎలాంటి నివారణ చర్య లు తీసుకోకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నారని సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ హోటల్ నుండి రామంతపూర్ ప్రధాన రహదారి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. అధికారులు పాలకులు ఇప్పటికైనా మేలుకొని రోడ్లపై చెత్త వేయకుండా చెత్త కేంద్రాలను వెంటనే ఎత్తివేయాలని చెరువులోకి మురుగు నీరుని పంపకుండా చూడాలని రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ మీరు చర్యలు తీసుకోకపోతే ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చర్యలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి గోసుల విజయ్ కుమార్, రవీందర్రావు, ముక్కాల సురేష్ గుప్తా, సిద్ధ గౌని రాజు, జిల్లా కిరణ్ కుమార్ లావణ్య, డాన్ బిక్షపతి కొంగర శ్రీనివాస్ సుధాకర్ కృష్ణ చారి, మల్లేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలే మా బలం...: 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బాణోత్ రాంబాయి



**కల్లూరు, ఫిబ్రవరి7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి బాణోత్ రాంబాయి గడపగడపకు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న సంక్షేమ పథకాలు నా విజయానికి కారణం అవుతాయని అన్నారు. 4వ వార్డులో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ప్రభుత్వ పథకాలు ఎమ్మెల్యే మట్టా దంపతులు, ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రుల సహకారంతో తమ వార్డులో అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. ప్రజలు అధికార పార్టీకి అండగా నిలబడితే అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేస్తామని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న వెంటనే తక్షణం పరిష్కరించడమే తమ ముందున్న లక్ష్యం అని అన్నారు. అదేవిధంగా డబల్ బెడ్ రూమ్ సముదాయంలో ఉన్న సమస్యలపై రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్ రెడ్డి, స్థానిక నాయకులు చల్లగుండ్ల చౌదరిబాబు లు కాలనిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారి సహకారంతో నాలుగో వార్డ్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు.

## 66వ డివిజన్‌లో బీఆర్ఎస్ ఘన రోడ్ షో గంగుల కమలాకర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేసిన చావరీయ కరణ్ సింగ్







**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు, 2026 ఫిబ్రవరి 07వ తేదీన, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 66వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రోడ్ షో నిర్వహించారు. వారసపు సంత రోడ్డు నుండి టవర్ సర్కిల్ జంక్షన్ వరకు జరిగిన ఈ రోడ్ షోలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలు, నినాదాలతో పరిసర ప్రాంతాలు హోరెత్తాయి. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో కలిసి ఇస్లాంపురా, ఖసాబ్ వాడి ప్రాంతాలలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి, కారు గుర్తుకు ఓటు వేయాలని నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో 66వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు.

## మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి: ఏఐటియుసి పిలుపు..



**అన్నమయ్య జిల్లా పుంగనూరు ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** రాష్ట్రంలో మున్సిపల్/ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, ఆప్కాస్ పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలని, కనీస వేతనం 26వేలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ముభారక్ తెలిపారు ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె నోటీసు శనివారం పుంగనూరు మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ కు ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను ఉపసంహరించాలని కోరుతూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయొద్దని కోరారు 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవుల ఎంక్మెంట్, డియేలు, గ్రాట్యుటీలు సత్వరం : విడుదల చేయాలని మరణించిన రిటైర్డ్ అయిన పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తిరిగి విధుల్లోకి తీసుకునే ప్రక్రియను కూటమి ప్రభుత్వం తిరిగి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పుంగనూరు నియోజకవర్గ నాయకులు వెంకటరమణ రెడ్డి, సీపీఐ పుంగనూరు పట్టణ కార్యదర్శి రాంమూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మున్నా, రెడ్డి శేఖర్, బాబు, వెంకటరమణ,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తా...

- **బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి**
- **14వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి సయ్యద్ రేష్మ**





**కల్లూరు, ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలన, చేసిన సంక్షేమ అభివృద్ధి పనులే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని 14 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సయ్యద్ రేష్మ ఇంతియాజ్ అన్నారు. శనివారం 14 వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను 20 వార్డులలో గెలిపించాలని అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో కాలంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సారథ్యంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు మా విజయానికి కారణం అవుతాయని అన్నారు. కోట్ల రూపాయల నిధులతో కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధి చేశారని అన్నారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ హాస్పటల్, మినీ స్టేడియం, నూతన బస్ స్టాండ్ ను చూస్తేనే బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి కనపడుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి శూన్యం అని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. 14వ వార్డు పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని, అర్హులందరకు సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాజీ జెడ్పిటిసి లక్కినేని రఘు ఆశీస్సులతో 14 వార్డులో పోటీ చేస్తున్నానని మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనుముల రాంబాబు, శీలంశెట్టి కిరణ్ కుమార్, ఎండి ఇంతియాజ్, కాకనబోయిన రాంబాబు, ఎనుముల గోపాలకృష్ణ, బషీరా, ఉలసా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో త్యాగాల తల్లి మతా రామాబాయి అంబేద్కర్ 128వ జయంతి ఉత్సవాలు








**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఫిబ్రవరి 7,(పిసిడబ్ల్యూ న్యూస్):** కూకట్ పల్లి దయర్ గూడా అంబేద్కర్ పార్క్ లో ఉత్సవ కమిటీ చైర్మన్ సింగూరు పూర్ణిమ పాండు ఆధ్వర్యంలో తల్లి రామబాయ్ అంబేద్కర్ జయంతి వేడుకలు కుషాయిగూడ ఆర్ టి సి బస్సు డిపో వద్ద ఎస్ సీ, ఎస్ టి అసోసియేషన్ గౌడ రవికిరణ్ ఆధ్వర్యంలో రాజీవ్ గృహ కల్ప కాలనిలో పాడుగుల రూప చంద్రమౌళి తన నివాస గృహంలో ఈ సందర్భంగా దయార గూడా అంబేద్కర్ పార్కులో నీ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ సింగూరు పూర్ణిమ పాండు, బేగారి యాదమ్మ పాల్గొని మహనీయులకు జ్ఞానమాలలు వేసి జ్ఞాన జ్యోతిని వెలిగించి బుద్ధ వందనం చేశారు.అనంతరం జ్ఞానమాల కన్వీనర్ సింగూరు పాండు మాట్లాడుతు త్యాగాల తల్లికి చివరి దశలో సంతోషం ఆఖరి గడియాలో మాత్రం బాబాసాహెబ్ రామబాయి వెంటే ఉన్నారు,తల్లి మీరూ కటిక దరిద్రాన్ని ఎదుర్కొంటూ కూడా సాహెబ్ పోరాటానికి మీ వంతు సాహాయ సహకారాలు అందించారు. ఒక పూట తిని మరో పూట పస్తులుండి అంబేద్కర్‌ని చదివించిన గొప్ప మాతృమూర్తి అందుకే చరిత్రలో త్యాగాల తల్లిగా నిలిచారు.బాబా సాహెబ్ మన నలుగురు పిల్లలు కోవుతులగా మారిపోయి వెలుగులు చిమ్ముతున్నారు, ఇప్పుడు నేను కూడా ఒక పెద్ద కొవ్వొత్తిగా మారి వారితో కలిసిపోతున్నాను ఈ మన వెలుగులు ప్రకాశవంతమై,మన ఇంటిని మన వాడను, మన ప్రాంతాన్ని దాటి దేశాన్ని దాటుతాయి దేశంలోని ప్రతి ఇంట్లో ప్రతి మనిషి కొవ్వొత్తుల వెలిగులో మెరిసిపోతూ ఉంటారు , భారతదేశం ప్రకాశవంతంగా వెల్ళిగిపోతది దేశంలో నూతన అధ్యాయం మొదలయ్యింది, ఈ వెలుగును ఆపేశక్తి ఎవరికీ లేదు, దేశంలోని ప్రతి గుడిసె, ప్రతి ఇల్లు, ప్రతి మనిషి మన కొవ్వొత్తుల వెలుగులో నిండిపోవాలి. మొదటగా నేను కవితను తరువాత రామ, ఆ తరువాత రామబాయి రను రాను రామబాయి అంబేద్కర్ ఇప్పుడూ మాత రామబాయి అంబేద్కర్ అని అంటూ 39వ యేటనే సాహెబ్ నే కాకుండా సమస్త ప్రజానీకానికి తను ఈ లోకన్ని విడిచి కన్నీటిని మిగిల్చింది తల్లి రామబాయి అంటే త్యాగం,త్యాగం అంటేనే మీ కుటుంబం మీ త్యాగం వెలకట్టలేనిది, ఇప్పటికి ఈ దేశం మిరు అందించిన వెలుగులోనే ఉంది.కార్యక్రమంలో మహిళా నేతలు బేగారి యాదమ్మ, గూటకాడి లక్షమ్మ, బచ్చలి పద్మ, సింగూరు అమరావతి, పోతురాజు శోభ, అనంత సువర్ణమ, జక్కుల లక్ష్మి, పసులది లక్షమ్మ, పోతురాజు హేమలత, మేకల లలిత, గుణగుంట సాయి కుమారి, పోతురాజు శ్రీలత, మేకల విజయలక్ష్మి, సిరగని లహరి, పోతురాజు ఉమ్మా, ఆలాగే నిత్య జ్ఞానమాల నిర్వహణ కమిటీ, అంబేద్కర్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొని తల్లికి ఘనంగా నివాళులు అర్పించరు.కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరికి సింగూరు ప్రసాద్ ఆల్పాహారాం ఏర్పాటు చేయగా న్యాయవాది సింగూరు శిల్ప మిఠాయిలను పంపిని చేశారు.

---

# విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

## • గ్లోబల్ పీపుల్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ అండ్ హెడ్ అరవింద్ మాథూర్







**హైదరాబాద్, ఫిబ్రవరి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం ద్వారానే కెరీర్లో అత్యుత్తమ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు విద్యార్థులకు అవకాశం లభిస్తుందని గ్లోబల్ పీపుల్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ అండ్ హెడ్ ఆరవింద్ మాథూర్ అన్నారు. అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో గుంతపల్లిలోని ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ రోజు శనివారం జరిగిన 'టెక్ ఇగ్నేట్ - 2026' సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచకోవాలని సూచించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన సాంకేతికతకు ఊతమిచ్చేలా విద్యా సంస్థలు పనిచేయాలని అన్నారు. ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధమయ్యే విధంగా తీర్చిదిద్దుతున్నందుకు అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్ రావు ని ఆయన అభినందించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రాయపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వి రమణ మాట్లాడుతూ ఇటువంటి టెక్నికల్ ఫెస్ట్ ల్లో పాల్గొనడం చాలా మంచిదని, తెలియని విషయాలను ఎన్నో నేర్చుకోవచ్చని వివరించారు. ఇలాంటి ఫెస్ట్ లు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీనివాస్ రావు, ఎంఎస్ఎంఈ హైదరాబాద్ డిప్యూటీ మేనేజర్ అబ్దుల్ ఖాదర్, ట్రిపుల్ ఐటీ డీఎం కర్నూల్ కళాశాల ప్రొఫెసర్ నాగరాజు, అవంతి కళాశాల డైరెక్టర్ వై. జయప్రద, ప్రిన్సిపాల్ పిహెచ్పీ శేషతల్పసాయి, కళాశాల ఇంచార్జీ బోసుబాబు, పీఆర్ ఓ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

---

# ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా...



## • 17వ వార్డులో వరాల జల్లు • కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వేము విజయలక్ష్మి

**కల్లూరు, ఫిబ్రవరి7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వేము విజయలక్ష్మి కరుణాకర్ ఎన్నికల ప్రచారంలో సరికొత్త వరవడి సృష్టిస్తున్నారు. శనివారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్ రావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కట్ట గోపాలరావు తో కలిసి ప్రచారం నిర్వహించారు. గడపగడపకి వెళుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న, ఇస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వార్డు పరిధిలో ప్రజలకు వివరిస్తూ, ఫిబ్రవరి 11న జరగబోయే కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్ దేవుళ్లను వేడుకున్నారు.ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం నాకు కల్పించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులకు రుణపడి ఉంటానని అన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి కలిగే తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ గుర్తు అయిన హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అన్నారు.ఈ ఎన్నికలలో నన్ను గెలిపిస్తే ప్రభుత్వం అందించే పథకాలతో పాటు వ్యక్తిగతంగా 3 హామీలు అమలు చేస్తానని వాగ్దానం చేశారు. **17వ వార్డులో వరాల జల్లు** విజయలక్ష్మి మాట్లాడుతూ17వ వార్డులో నూతనంగా మంజురయే ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కో ఇంటికి 20 సిమెంట్ కట్టలు తను సొంతంగా ఇస్తానని మొదటి హామీ ఇచ్చారు.17వ వార్డులో నిరుపేద కుటుంబంలో జరిగే ఆడబిడ్డ పెళ్లికి తనవంతుగా 5116 రూపాయిలు ఆర్థిక సహాయం అందిస్తానని రెండో హామీ ఇచ్చారు. 17వ వార్డులో నిరుపేద కుటుంబంలో పుట్టే ప్రతి ఆడబిడ్డకు తనవంతుగా 5116 రూపాయిలు ఫిక్స్ డిపాజిట్ చేస్తానని 3వ హామీ ఇచ్చారు. నేను ఇచ్చిన ఈ మూడు హామీలు అమలు చేసి తీరుతానని 17వ వార్డు ప్రజలకు అంబేద్కర్ సాక్షిగా వాగ్దానం చేశారు. 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని వేము విజయలక్ష్మి ఇచ్చిన హామీలకు వార్డు పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ లింగన బోయిన పుల్లారావు, ఉబ్బన ప్రభాకర్ రావు, వేము దినాకర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---





# ఘనంగా తల్లి రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు

**చిట్యాల జనవరి 7 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగంధర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి సతీమణియగు తల్లి రమాబాయి 128వ జయంతిలి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య లు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి సతీమణి గా ఉండి కష్టసుఖాలను చూసుకుంటూ వారికి కొండంత అండగా నిలిచిన గొప్ప త్యాగమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల మాజీ అధ్యక్షులు సరిగొమ్ముల రాజేందర్ మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు 12వ వార్డు సభ్యులు శనిగారపు మొగిలి అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత గురుకుంట్ల కిరణ్ మైదం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

---

## రామంతాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా
# ధూపాటి సురేష్ ఎన్నిక





**ఉప్పల్ ఫిబ్రవరి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతాపూర్( రామంతాపూర్,వెంకట్ రెడ్డి నగర్, హబ్సిగూడ) ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ధూపాటి సురేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎ.విజయేందర్ రెడ్డి,ఉపాధ్యక్షుడిగా ఎం. ఆశోక్,ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.జక్రియా, కార్యదర్శిగాపి.నర్సిములు, కోశాధికారిగా యాదగిరి గౌడ్, కార్యవర్గ సభ్యులుగా ముత్యం రెడ్డి, కె. రాజు,షేక్ పాషా లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ జర్నలిజం విలువలకు కట్టుబడి నీతి,నిజాయితీ తో క్లబ్ పనిచేస్తుందని, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

## నిషేధిత లాటరీ టికెట్ల విక్రయిస్తున్న
# ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 7 పీసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా పుంగనూరు పట్టణంలో నిషేధిత లాటరీ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏ ఎస్ ఐ అశ్వత్ నారాయణ తెలిపారు. పుంగునూరు పట్టణానికి చెందిన గోవిందప్ప, మోహన్ బాబులను పోలీసులు అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 3400 రూపాయలు విలువ చేసే 17 నిషేధిత లాటరీ టికెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు నిషేధిత లాటరీ విక్రయాలపై ఉక్కు పాదం మోపను న్నట్లు ఆయన తెలిపారు. నిషేధిత లాటరీ టికెట్లు విక్రయిస్తున్న సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు.

## భారతదేశానికి ICC అండర్19 క్రికెట్ వరల్డ్ కప్ విజయం అందించిన మల్లాపూర్ వాసి ఆరోన్ జార్జ్‌కి హృదయపూర్వక శుభాకాంక్షలు



**ఉప్పల్ ఫిబ్రవరి 07 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతదేశానికి ప్రతిష్టాత్మకమైన ICC అండర్19 క్రికెట్ వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించి దేశానికి గర్వకారణంగా నిలిచిన మల్లాపూ ర్ వాసి ఆరోన్ జార్జ్ కి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఆరోన్ జార్జ్ ఈ ఘన విజయం యువతకు ప్రేరణగా నిలుస్తుందని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మల్లాపూర్ ప్రాంతానికి, ఉప్పల్ నియోజకవర్గానికి ఆయన తెచ్చిన కీర్తి అపూర్వమని ఎమ్మెల్యే ప్రశంసించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో స్కూల్ వ్యాను దగ్ధం



**చిట్యాల జనవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలోని రైజింగ్ సన్ స్కూల్ వ్యాన్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధం అయింది. స్కూల్ వ్యాన్ సాయంత్రం సమయంలో పిల్లలను స్కూల్ నుంచి ఇంటి వద్దకు చేరుకొని మళ్లీ తిరిగి స్కూల్ వద్దకు వెళ్లే క్రమంలో తిరుమలాపురం గ్రామ శివారులో బ్రిడ్జి పైకి రావడంతో, ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో డ్రైవర్ అప్రమత్తమై ప్రాణాలు రక్షించుకున్నాడు ఎవరికి ఏం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారని స్థానికులు తెలిపారు.

# విద్యతో నాయకత్వం... సేవతో అభివృద్ధి



**19వ వార్డులో గెలుపు గులాబీదే**

**ప్రజల విశ్వాసం బిఆర్ఎస్ వైపే**

**ఉన్నత విద్యావంతురాలిని గెలిపించండి**

**వార్డును అభివృద్ధి పథంలో నడిపిద్దాం**

**మున్సిపల్ ఇంచార్జ్ దిండిగల రాజేందర్ పిలుపు**





**కల్లూరు, ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు రాజకీయ వాతావరణం రోజురోజుకు వేడెక్కుతోంది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం పార్టీ మద్దతుతో బిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఉన్నత విద్యావంతురాలు ఖమ్మంపాటి స్వరూప రమేష్ విజయం సాధించాలని ప్రజలను కోరుతూ శాంతినగర్‌లో విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ ఇంచార్జ్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ విద్య, అవగాహన, సేవా దృక్పథం కలిగిన అభ్యర్థిని గెలిపిస్తేనే వార్డుకు నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అని స్పష్టంగా పేర్కొన్నారు. **ఇంటింటి ప్రచారంతో ఓటర్లకు చేరువైన నాయకత్వం** ఎన్నికల ప్రచారంలో భాగంగా శాంతినగర్ లో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుసుకున్న దిండిగల రాజేందర్, స్థానిక ప్రజల సమస్యలను నేరుగా వినిపించుకున్నారు. ప్రతి ఇంటి ముంగిట నిలబడి, ఓటర్లతో ముఖాముఖి సంభాషణ జరుపుతూ, ఉన్నత విద్యావంతురాలైన స్వరూప రమేష్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న అభ్యర్థి కావాలంటే,19వ వార్డులో గెలవాల్సింది స్వరూప రమేషేఅని వ్యాఖ్యానించారు.ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అభివృద్ధి బాటలో కల్లూరు ప్రచార సభలో దిండిగల రాజేందర్ మాట్లాడుతూ,స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో కల్లూరు పట్టణం ఏ విధంగా అభివృద్ధి చెందిందో ప్రజలందరికీ తెలుసు అని గుర్తు చేశారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన పురోగతిని ఆయన వివరించారు. ఇప్పుడు అదే అభివృద్ధి వేగం మున్సిపాలిటీలో కొనసాగాలంటే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరినీ గెలిపించాల్సిన అవసరం ఉంది అని ఆయన స్పష్టం చేశారు. విద్యావంతురాలైన అభ్యర్థి వార్డుకు బలమైన భరోసా 19వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఖమ్మంపాటి స్వరూప రమేష్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆమె కేవలం అభ్యర్థి మాత్రమే కాదు, సమస్యలను అర్థం చేసుకునే అవగాహన, అధికారులతో సమన్వయం చేసే సామర్థ్యం, ప్రజల కోసం నిలబడే ధైర్యం,అన్నీ ఉన్న నాయకురాలు అని కొనియాడారు.వార్డు పరిధిలో డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, వీధుల అభివృద్ధి, పారిశుద్ధ్య లోపాలు వంటి అంశాలు ఉన్నాయని పేర్కొంటూ, వాటన్నింటినీ అధికారులతో చర్చించి పరిష్కరించే దిశగా కృషి చేసే నాయకత్వం స్వరూప రమేష్‌లో ఉందని అన్నారు.బిఆర్ఎస్ గెలిస్తే అభివృద్ధి గ్యారంటీ. ప్రచారంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే కల్లూరు మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సక్రమంగా వినియోగించి, ప్రతి వార్డులో మౌలిక వసతులు మెరుగుపరచడమే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు.“మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి, విద్యావంతురాలైన స్వరూప రమేష్‌ను గెలిపించండి”అని ఓటర్లను కోరారు.శాంతినగర్ ప్రజల్లో అనుకూల స్పందన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలకు శాంతినగర్ ప్రజల నుంచి అనుకూల స్పందన లభించింది. మహిళలు, యువత, వృద్ధులు అందరూ అభ్యర్థి విద్యార్హతలు, మాట్లాడే తీరు, సమస్యలపై చూపిస్తున్న అవగాహనను ప్రశంసించారు. మాకు మాటలకన్నా పని చేసే నాయకుడు కావాలి అని పలువురు ఓటర్లు అభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు ఉపయోగపడ్డాయని గుర్తు చేసుకుంటూ, ఈ ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్‌కే ఓటు వేస్తామని తెలిపారు.సిపిఎం మద్దతుతో బలమైన పోటీ. ఈ ఎన్నికల్లో సిపిఎం పార్టీ మద్దతుతో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్వరూప రమేష్‌కు విస్తృత మద్దతు లభిస్తోంది. వామపక్ష భావజాలం, అభివృద్ధి రాజకీయాలు కలిసిన ఈ పోటీ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. **గెలుపే లక్ష్యం సేవే సంకల్పం** ఈ సందర్భంగా అభ్యర్థి ఖమ్మంపాటి స్వరూప రమేష్ మాట్లాడుతూ నన్ను గెలిపిస్తే 19వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతాననీ ప్రతి సమస్యపై అధికారులతో పోరాడతాను అని అన్నారు.ప్రతి ఇంటి గడప తొక్కి సమస్యలు పరిష్కరించే నాయకురాలిగా ఉంటానుఅని హామీ ఇచ్చారు. ప్రచారంలో పాల్గొన్న ప్రముఖులుమాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వెంగళ వెంకటేశ్వర్లు, మాతిపోగు రాము, మోదుగు రమేష్, వెంగళ సురేష్, వెంగళ రాము, మాతిపోగు ముఖేష్ తదితరులు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు. వారు కూడా ఓటర్లను కలిసి, బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించా లని కోరారు. 19వ వార్డులో గులాబీ జెండా ఎగరడం ఖాయం అని అన్నారు. మొత్తంగా చూస్తే,అభివృద్ధి పాలన, విద్యావంతురాలైన అభ్యర్థి,ప్రజల విశ్వాసం, బలమైన పార్టీ వ్యవస్థ ఈ నాలుగు అంశాలు కలిసివచ్చి,19వ వార్డులో బిఆర్ఎస్ విజయం ఖాయ మనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో చూడాలిడకానీ శాంతిన గర్ వీధుల్లో వినిపిస్తున్న మాట ఒక్కటే ఈసారి గెలుపు గులాబీదే అని బిఆర్ఎస్ నాయకులు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీర య్య సహకారంతో శాంతినగర్ ను ఒక మోడల్ శాంతినగర్ గా తీర్చిదిద్దుకునే విధంగా కృషి చేద్దామని ఆశాభావం వ్యక్తం చేశారు.





# ‘బేబీమూన్‘లో అలరించిన “సాంప్రదాయ సేంద్రీయ వ్యవసాయ ప్రదర్శన“









**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నేటి యాంత్రిక జీవనంలో మరుగున పడిపోతున్న మన ప్రాచీన ఆరోగ్యకరమైన జీవన విధానాలను, వ్యవసాయ పద్ధతులను నేటి తరానికి పరిచయం చేసే ఉద్దేశంతో ఖమ్మంలోని ‘బేబీమూన్ హైస్కూల్‘ శనివారం నాడు అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. సాంప్రదాయ సేంద్రీయ వ్యవసాయ విధానం అనే అంశంపై విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.ఒ ఈ కార్యక్రమాన్ని బేబీమూన్ స్కూల్ విద్యాసంస్థల అధినేత కేసా వీరన్న, కేసా సుగుణలు రిబ్బన్ కట్ చేసి ఈ ప్రదర్శను ప్రారంభించారు. **కళ్ళకు కట్టినట్లు ‘నమూనా గ్రామం‘** పాఠశాల ఆవరణలో 3వ, 4వ, 5వ తరగతి విద్యార్థులు ఒక అద్భుతమైన మోడల్ విలేజ్ను నిర్మించారు. ఈ ప్రదర్శనలో భాగంగా వ్యవసాయ భూమిని సిద్ధం చేయడం, నీటి పారుదల పద్ధతులను విద్యార్థులు వివరించారు. వరి నుండి బియ్యం వరకు, గోధుమ నుండి పిండి వరకు జరిగే ప్రక్రియలను నమూనాల ద్వారా ప్రదర్శించారు.గ్రామీణ జీవనంలో రోలు-రోకలితో ధాన్యం దంచడం, విసుర్రాయి వాడకం, గిత్తల బండి, ట్రాక్టర్ నమూనాలు మరియు సాంప్రదాయ ఆటలైన ‘అష్టా-చమ్మా‘ వంటి వాటిని ప్రదర్శించి పాత రోజులను గుర్తుకు తెచ్చారు. **ముఖ్య అతిథులు మరియు ప్రశంసలు** ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ కేసా వీరన్న గారు మరియు శ్రీమతి కేసా సుగుణ గారు హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా పాఠశాల డైరెక్టర్లు శ్రీ కేసా భాస్కర్ గారు మరియు శ్రీమతి కేసా కల్యాణి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యకరమైన ఆహారం మరియు సాగు పద్ధతులపై చిన్నారులకు అవగాహన కల్పించడం అభినందనీయమని కొనియాడారు. **విశేష స్పందన** ఈ ప్రదర్శనను వీక్షించడానికి ఖమ్మం పట్టణ ప్రజలు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తమ నమూనాల గురించి వివరిస్తుంటే సందర్శకులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ప్రీ-ప్రైమరీ విద్యార్థులు కూడా తమ తల్లిదండ్రులతో కలిసి సందర్శకులుగా పాల్గొని ఉత్సాహపరిచారు.ఒ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ముఖ్యంగా ప్రైమరీ స్కూల్ విభాగం స్వరూప, రమాదేవి, రజిత సునితాల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం, భావి తరాలకు మన మూలాలను గుర్తు చేసేలా విజయవంతంగా ముగిసింది.

# బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటే... మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

**● కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంత్రి ఎన్నికల ప్రచారం..**



**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో బీఆర్ఎస్ బీజేపీ పార్టీలు ఒకటై కుమ్మకు రాజకీయాలు చేస్తున్నాయని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి కోలగాని అనిల్ తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.అనంతరం 54, 30,31,32,33 వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థుల తరపున నాకా చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ లో గెలిచిన కార్పొరేటర్లు కు ఇందిరమ్మ ఇళ్లు అర్హులను గుర్తించి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.కరీంనగర్ లో బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని మంత్రి ఓటర్లను కోరారు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



# కరీంనగర్లో గేమ్ ఛేంజర్ ఎంఐఎమే: అసదుద్దీన్ ఓవైసీ



**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 7(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రాజకీయాల్లో మార్పు తీసుకువచ్చే శక్తి కేవలం ఎంఐఎం పార్టీకి మాత్రమే ఉందని ఏఐఎంఐఎం జాతీయ అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ స్పష్టం చేశారు. నగరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని ఆరోపించారు. గంగుల కమలాకర్ ఎంఐఎం సహకారంతో గెలిచి, ప్రస్తుతం అదే పార్టీపై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఎంఐఎం మాజీ కార్పొరేటర్లను బీఆర్ఎస్‌లో చేర్చడాన్ని తీవ్రంగా ఖండించారు.గంగుల కమలాకర్ 2028 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈడీ, సీబీఐ, ఐటీ దాడుల నుంచి తప్పించుకునేందుకే రాజకీయ వ్యూహాలు పన్నుతున్నారని విమర్శించారు. కాషాయ కండువా కప్పుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు.బీజేపీ నేతలు కేవలం ఎంఐఎంను, ఓవైసీ సోదరులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. దేశ భద్రత, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ, విద్య, వైద్యం వంటి అంశాలపై దృష్టి పెట్టకుండా మత రాజకీయాలతో ఓట్లు సాధిస్తున్నారని ఆరోపించారు.చైనా సైన్యం భారత భూభాగంలోకి చొరబడిన విషయంపై ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గాల్వాన్ లోయలో వీరమరణం పొందిన సైనికులను గుర్తు చేస్తూ, దేశ భద్రతపై బీజేపీ వైఫల్యమైందని విమర్శించారు.యూజీసీ చట్టంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు తగిన ప్రాతినిధ్యం లేదని ఆరోపించారు. ఇది భవిష్యత్తులో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు.నగరంలోని 15 డివిజన్లలో ఎంఐఎం కార్పొరేటర్లను గెలిపిస్తే, నీటి సమస్య, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్లు, సర్టిఫికెట్ల డోర్ డెలివరీ వంటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గంగుల కమలాకర్ అనుచరులు పేద ముస్లింల ఇళ్లను కూల్చివేశారని, దీనిపై ఎంఐఎం పోరాడి కేసులు నమోదు చేయించిందని తెలిపారు. బీజేపీఆర్ఎస్ఎస్ విధానాలు దేశానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై ఎంఐఎం జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఎంఐఎం అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ సభలో ఎంఐఎం ఉమ్మడి జిల్లా పరిశీలకుడు యాసర్ అరఫాత్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఓవైసీ



ప్రసంగానికి యువత పెద్ద ఎత్తున కేరింతలతో స్పందించింది.



# మన బిడ్డల భవిష్యత్తుకోసం తన జీవితం అంకితం










**- వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి**

**- ఘనంగా త్యాగధని రమాబాయి జయంతి**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మన బిడ్డల కోసం తన బిడ్డల భవిష్యత్తును ఆలోచించని త్యాగధని మాత రమాబాయి అని పలువురు వక్తలు కొనియాడారు. భారతదేశం వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు అవసమని గుర్తించి, నిరంతరం శ్రమించిన రమాబాయి కారణంగానే మనకు భారత రాజ్యాంగం రచించే అవకాశం అంబేద్కర్ కు లభించిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక వైయస్సార్ కాలనీలో రమాబాయి జయంతి కార్యక్రమాన్ని వీర నారీమణుల ఆశయ సాధన సమితి సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ ఉపాధ్యక్షురాలు భూక్య జ్యోతి అధ్యక్షతన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగాలు చేశారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. వీర వనిత రమాబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి మాట్లాడుతూ... జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చిన వాటిని ఎదుర్కొంటూ తన భర్త అంబేద్కర్ ఆశయ సాధనకు తన బ్రతుకంతా దారపోసిన వీరనారీమణి మాత రమాబాయి అని కొని యాడారు. తన పిల్లలు మృతి చెందిన అణగారిన వర్గాల బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించిన మాత రమాబాయి అని తెలిపారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బానోతు భద్రు నాయక్ మాట్లాడుతూ... పేద నిమ్న వర్గానికి చెందిన రమాబాయి వారి సంక్షేమం, అభివృద్ధి గురించి తపన పడ్డారని, తన భర్త అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత కావడానికి ఆమే చేసిన త్యాగాలు, తన పిల్లలు చని పోయిన తన కార్య దీక్షను విరమించని ధీర వనిత రమాబాయి అని కొని యాడారు. సామాజిక వేత్త మీగడ రామారావు మాట్లాడుతూ.. మాత రమాబాయి జీవితం మహిళా మణులకు ఆదర్శం, స్ఫూర్తి దాయకం... తన లక్ష్య సాధనలో అనేక కష్టాలు భరించి, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ద్వారా భారత రాజ్యాంగాన్ని అందించిన వీరనారి మాత రమాబాయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరా నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా కార్యదర్శి స్పందన, సహాయ కార్యదర్శి షరీఫా బేగం, ఆఫీస్ ఇంచార్జి కృష్ణవేణి, అధికార ప్రతినిధి సరోజని, గౌరవ సలహా దారులు కొత్తపల్లి పుష్ప, శ్రీదేవి, సభ్యులు విజయ, లక్ష్మి, స్వాతి, నాగమణి, శ్రీదేవి, వర లక్ష్మీ, ఉషా, రమ్య, కుమారి, ప్రమీల, లత, జాన్సీ,క్రమ శిక్షణ కమిటీ కన్వీనర్ పుల్లూరి నాగయ్య, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు యలమందల జగదీష్ , ఆటో యూనియన్ అధ్యక్షులు పందు, అంబేద్కర్ సంఘం నాయకులు రాము, బహుజన సంఘం నాయకులు గాంధీ, నకరికంటి సంజీవరావు, విజయ్, అర్జునరావు, శ్రీనివాసచారి, రామ్మూర్తి, వజినపల్లి రామారావు, అఖిల్, వీరన్న నాయక్, సురభి నాయక్, వెంకటేశ్వర్లు, పాష, హరినాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

---

## ముందస్తు తేదీలతో వినియోగదారుల మోసం.. చర్యలు తీసుకోవాలి

**● జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ డిమాండ్**







**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 07(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామంలో ఉన్న ఒక కిరాణా షాపులో వినియోగదారులను మోసం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. 06-02-2026 తేదీన కిరాణం షాపులో కొనుగోలు చేసిన రెడ్మి పరోటా ప్యాకెట్‌పై ముందస్తు తేదీ ముద్రించబడినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని గమనించిన జాతీయ మానవ హక్కుల కమిటీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ స్పందిస్తూ, ఇలాంటి చర్యలు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు తేదీలు వేసి పాడైపోయిన ఆహార పదార్థాలను విక్రయించడం ద్వారా వినియోగదారులను మోసం చేస్తున్న వ్యాపారులపై సంబంధిత అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, నాణ్యత లేని మరియు గడువు మించిన ఉత్పత్తులను విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. ప్రజలు కూడా ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

---

## ఆప్యాయతే ఆయుధంగా....







**- ఓటర్ల హృదయాలు గెలుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అనిత**

**- సత్యనారాయణపురం వార్డులో ముమ్మరంగా సాగుతున్న ప్రచారం**

**- మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల నుంచి విశేష మద్దతు**

**- భారీ మెజారిటీతో గెలుపు ఖాయం అంటూ కాంగ్రెస్ శ్రేణుల ధీమా**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 7 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పాలేరు నియోజకవర్గం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురం వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోకబత్తిన అనిత ప్రజల మన్ననలు పొందుతూ ఎన్నికల బరిలో దూసుకుపోతున్నారు. గత వారం రోజులుగా వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతున్న ఆమె ఆప్యాయత, అనురాగభరిత పలకరింపు ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. అమ్మమ్మ, నానమ్మ, అక్క, చెల్లి అంటూ కుటుంబ సభ్యుల్లా ఓటర్లను పలకరిస్తున్న అనిత తీరుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిరునవ్వుతో సాగుతున్న ఆమె ప్రచారం ప్రజల మనసులను గెలుచుకుంటోంది. తమ ఆడపడుచుగా భావిస్తూ కాంగ్రెస్ అభ్యర్థికి స్థానిక మహిళలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటిస్తున్నారు. ఇందిరమ్మ కాలనీ, సత్యనారాయణపురం ప్రాంతాల్లో అనితకు మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు అనితకు అండగా నిలుస్తామని ముందుకు వస్తున్నారు. సాయి నగర్ వెంచర్, రాఘవేంద్ర నగర్, గాయత్రీ నగర్ వంటి ఉద్యోగస్తుల కాలనీల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థికి విశేష ఆదరణ లభిస్తోంది. తమ కాలనీల సమస్యల పరిష్కారానికి అనిత నాయకత్వం అవసరమని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ప్రచారాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనితను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**అభివృద్ధే లక్ష్యం.. ప్రజల సంక్షేమమే ప్రాధాన్యం**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోకబత్తిన అనిత మాట్లాడుతూ... సత్యనారాయణపురం వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీల శుభ్రత, రోడ్ల అభివృద్ధి, వీధి లైట్ల ఏర్పాటు వంటి మౌలిక వసతుల సమస్యలను మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డు పరిధిలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, హిందూ దేవాలయాలకు అవసరమైన స్థలాలు కేటాయించి వాటి నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. మహిళల భద్రత, శాంతి భద్రతలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసిన అనిత, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా అంకితభావంతో పనిచేస్తానని ఓటర్లకు భరోసా ఇచ్చారు.

PCW తెలుగు దినపత్రిక



# జీ5 వేదికగా ఓటిటిలోకి మన శంకరవరప్రసాద్ గారు

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చేసింది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పుడు డిజిటల్ తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా.. ఈ సినిమాను ఫిబ్రవరి 11నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దర్శకుడు అనిల్ రావిపూడి మార్కు కామెడీ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందిన ఈ చిత్రం, థియేటర్లలో ఏకంగా రూ.375 కోట్లకు పైగా వసూళు సాధించి ఇండస్ట్రీ హిట్లలో ఒకటిగా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించగా, విక్టరీ వెంకటేష్ తన స్పెషల్ అప్పీరెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేశారు. ముఖ్యంగా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యే వెర్షన్‌లో థియేటర్లో కట్ చేసిన కొన్ని చిరంజీవి, ÷ం గణెలిష్ కాంబినేషన్ కామెడీ సీన్లను కూడా జత చేయబోతుండటం విశేషం.




# సిద్ధూ జొన్నలగడ్డ కొత్త చిత్రం


## డైరెక్టర్ ఆర్ఎస్‌జెతో మూవీ

టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కొత్త సినిమాను ప్రారంభించాడు. శనివారం ఫిబ్రవరి7 ఆయన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ప్రస్తుతం సరైన హిట్లు లేక సతమవుతున్న సిద్ధు తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జే (ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్) తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్ఛ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరాలను చిత్రబృందం వెల్లడించనుంది. సిద్ధు తనదైన శైలిలో మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈసారి బాక్సాఫీస్ వద్ద బ్లాస్ట్ ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తూ సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. సితార బ్యానర్‌లో సిద్ధుకి ఇది హ్యాట్రిక్ సినిమా కావడం విశేషం



# హైదరాబాద్‌లో దోమల బాధ

## సెటైరికల్‌గా కార్తికేయ వీడియో విడుదల



హైదరాబాద్ నగరంలో దోమల ఉధృతి ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అందరూ ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ విషయంపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకపోవడంతో ఇదే విషయాన్ని సెటైరికల్‌గా తెలియజేశాడు రాజమౌళి తనయుడు ఎస్-ఎస్ కార్తికేయ. ప్రస్తుతం కార్తికేయ ఒక సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్నారు. అర్ధరాత్రి జరుగుతున్న ఈ షూటింగ్‌లో దోమలు విపరీతంగా ఉండటంతో యూనిట్ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను వ్యంగ్యంగా చూపిస్తూ కార్తికేయ ఒక వీడియోను చిత్రీకరించారు. షూటింగ్ లైట్ల వెలుతురులో దోమలు గుంపులు గుంపులుగా తిరుగుతున్న దృశ్యాలను ఆయన కెమెరాలో బంధించారు. 'హైదరాబాద్ దోమలు మామూలుగా లేవు.. షూటింగ్ చేయడం కూడా కష్టమైపోతోంది' అనే అర్థం వచ్చేలా ఆయన చేసిన ఈ వీడియో చూసి నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. రాజమౌళి గారి సినిమాలో గ్రాఫిక్స్ లాగా ఈ దోమలు ఏంటి ఇంత భయంకరంగా ఉన్నాయి?' అంటూ కొందరు కామెంట్స్ చేస్తుంటే.. మరికొందరు హైదరాబాద్ మున్సిపల్ అధికారులను, ప్రభుత్వాని ట్యాగ్ చేస్తున్నారు. కార్తికేయ పోస్ట్ చేసిన ఈ వీడియో గంటల వ్యవధిలోనే వైరల్‌గా మారింది.

# పెళ్లి తరువాత సామ్‌లో కొత్త కళ

కెరీర్ పరంగా కొంత విరామం తీసుకున్న సమంత మళ్లీ తనదైన మార్కు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతోంది. తాను నిర్మించిన థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ -శుభం-లో గెస్ట్ క్యారెక్టర్ చేసిన సామ్ త్వరలో పూర్తి స్థాయి క్యారెక్టర్‌తో యాక్షన్ మోడ్‌లో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఆమె నటిస్తున్న భారీ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా -మా ఇంటి బంగారం-. నందిని రెడ్డి డైరెక్టర్. సామ్ తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మిస్తున్న రెండవ సినిమా ఇది.

నందినిరెడ్డి డైరెక్టర్ అయినా సామ్ భర్త రాజ్ నిడిమోర్ క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. గత నెల విడుదల చేసిన ఈ మూవీ టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ మూవీని 1980వ దశకం నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇష్టం లేకుండానే ఓ కుటుంబంలోకి ప్రవేశించిన కోడలిని ఆ ఇంటి వారు ఎలా బయటకి వెళ్లగొట్టాలనుకున్నారు? ఇందులో వారు చేసిన ప్రయత్నాలని సామ్ ఎలా తిప్పి కొట్టింది అన్నదే ఈ చిత్ర ప్రధాన కథగా తెలుస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇదిలా ఉంటే నాగాచైతన్యతో విడాకులు తీసుకుని కొంత కాలం ఆరోగ్య సమస్యలతో సతమతమైన సామ్ ఇటీవల డైరెక్టర్ రాజ్ నిడిమోర్‌ని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లి తరువాత నుంచి ప్రొఫెషనల్ వర్క్‌లో సామ్‌బిజీగా మారిపోయింది. రాజ్ నిడిమోర్ సహకారంతో -శుభం- మూవీని నిర్మించి సక్సెస్ సాధించిన సమంత అదే జోష్‌తో ఇప్పుడు -మా ఇంటి బంగారం-లో నటిస్తూ నిర్మిస్తోంది.

ఓ పక్క సినిమాల్లో నటిస్తూనే గతంలో సోషల్ మీడియాలో బిజీగా ఉన్నట్టే ఇప్పుడూ అదే పంథాని కొనసాగిస్తూ చాలా చలాకీగా వ్యవహరిస్తోంది. రాజ్‌తో కలిసి క్రిస్మస్ వేడుకలని హ్యాపీగా సెలబ్రేట్ చేసుకున్న



# అవార్డులకు రెండు, మూడు నెలల్లో నంది అవార్డుల వేడుక

## ఏపీ మంత్రి కందుల దుర్గేశ్




సినిమా, టీవీ, నాటకరంగ కళాకారులకు ఇచ్చే నంది అవార్డులపై ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ కీలక ప్రకటన చేశారు. నంది అవార్డులకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారని... త్వరలోనే అవార్డులు ఇస్తామని తెలిపారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.2014, 2015, 2016 సంవత్సరాలకు గాను 2017లో నంది అవార్డులను అప్పటి ప్రభుత్వం (టీడీపీ) ఇచ్చిందని... ఆ తర్వాత మళ్లీ ఇవ్వలేదని దుర్గేశ్ తెలిపారు. అప్పటి నిబంధనల ప్రకారమే ఇప్పుడు కూడా అవార్డులు ఇవ్వాలా? లేక మార్పులు ఏమైనా చేయాలా? అనే దానిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నందమూరి బాలకృష్ణ నుంచి ఈ అవార్డులపై సలహాలు తీసుకుంటామని తెలిపారు. రెండు, మూడు నెలల్లో అవార్డుల వేడుక ఉంటుందని వెల్లడించారు. నంది నాటకోత్సవాలను కూడా నిర్వహిస్తామని చెప్పారు.

# జపాన్‌లో ప్రభాస్‌కు సూపర్ క్రేజీ

## అనన్ మ్యాగజైన్ కవర్‌పై ప్రభాస్ ఫోటో

టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ క్రేజ్ రోజు రోజుకీ ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరిస్తోంది. ఇప్పటికే పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపైనా తన ముద్రను బలంగా వేస్తున్నారు. తాజాగా జపాన్‌కు చెందిన ప్రముఖ లైఫ్ స్టైల్ మ్యాగజైన్ 'అనన్' కవర్ పేజీపై ప్రభాస్ కనిపించడం అభిమానుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ఫిబ్రవరి 10న విడుదల కానున్న ఈ మ్యాగజైన్ 2483వ సంచిక బ్యాక్ కవర్‌పై ప్రభాస్ ప్రత్యేకంగా చోటు సంపాదించటం విశేషం. ఈ గౌరవం సాధించిన మొట్టమొదటి భారతీయ నటుడిగా ప్రభాస్ రికార్డు సృష్టించారు. గతంలో 'ఆర్ఆర్ఆర్' సినిమా సంచలన విజయం తర్వాత ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి ఈ మ్యాగజైన్ కవర్‌పై కనిపించిన విషయం తెలిసిందే. అయితే, ఒక భారతీయ హీరో సోలోగా అనన్ కవర్‌పై మెరవడం మాత్రం ప్రభాస్‌తోనే మొదలైంది. దీంతో ఆయన అంతర్జాతీయ ఫ్యాన్ బేస్ ఎంత బలంగా ఉందో మరోసారి రుజువైంది. ఆయన వ్యక్తిత్వం, స్టైలిష్ లుక్, గంభీరమైన ఆరా ఈ ఫోటోషూట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మ్యాగజైన్ డిజైన్‌లో ప్రభాస్‌కు ఇచ్చిన ప్రాధాన్యం ఆయన గ్లోబల్ ఇమేజ్‌ను ప్రతిబింబిస్తోంది. డిసెంబర్ 2025లో తన సినిమాల ప్రమోషన్ నిమిత్తం ప్రభాస్ టోక్యో పర్యటనకు వెళ్లిన సమయంలో ఈ ఫోటోషూట్ నిర్వహించినట్లు సమాచారం. అప్పటినుంచే జపాన్ మీడియాలో ఆయనపై ప్రత్యేక కథనాలు వెలువడుతుండగా, ఇప్పుడు అనన్ మ్యాగజైన్ కవర్‌తో ఆ ఆసక్తి మరింత పెరిగింది.




# పవన్ అభిమానులకు డబుల్ ధమాకా

## వచ్చేనెలలో ఉస్తాద్ విడుదలతో పాటు కొత్త మూవీకి రెడీ

పవన్ కళ్యాణ్ అభిమానులకు వచ్చే నెల నిజంగానే డబుల్ ట్రీట్ కానుంది. ఒకవైపు ఆయన హీరోగా నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు కొత్త సినిమాకు కూడా శ్రీకారం చుట్టబోతున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తుండటం అభిమానుల్లో మరింత ఆసక్తి పెంచుతోంది. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే నెలలో ఆయన కొత్త ప్రాజెక్ట్ కూడా ప్రారంభం కానుంది. ఉగాది సందర్భంగా మార్చి 19న పవన్ కళ్యాణ్ -సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాకు రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ తొలి వారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మించనున్నారని, పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని టాక్. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కనిపిస్తున్న స్టైలిష్ లుక్ కూడా ఈ సినిమాకోసమే రెడీ చేసినదేనని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 'ఓజీ' చిత్రంలో ముంబై గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్న పవన్ కళ్యాణ్‌ను అదే తరహా పాత్రల్లో చూడాలని నేటి తరం ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ఆ అభిరుచిని దృష్టిలో పెట్టుకుని మరోసారి గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ కథనే ఎంచుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. రాబోయే ఈ సినిమా 'ఓజీ' కంటే కూడా ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుందని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుద్ సంగీతం అందించే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నటీనటుల వివరాలు, ముఖ్యంగా విలన్ పాత్రలో ఓ ప్రముఖ హీరో కనిపించే అవకాశం ఉందన్న ప్రచారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

